బానిసలం కాదు


జీడి పిక్కలను కటింగ్ చేసి, పప్పును తీస్తున్న మహిళా కార్మికులు


జీడిపప్పును వేరుచేస్తున్న కార్మికులు

- పని గంటల పెంపుతో ఆగ్రహ జ్వాలలు
- అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్
- ఉద్యమానికి సిద్ధం అంటున్న కార్మిక వర్గాలు

తుని రూరల్: రోజువారీ పని గంటలు పెంచడం, రాత్రివేళల్లో మహిళలు పనులు చేయొచ్చంటూ ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంపై కార్మిక వర్గంలో కలకం రేగింది. ఇప్పటికే శ్రమ దోపిడీకి గురవుతున్నామని భావిస్తున్న కార్మికులపై పనిభారం పెంచుతూ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకే ఇటువంటి నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుంటోందని ఆయా వర్గాల్లో ఆందోళన వెల్లువెత్తుతోంది. సమాచార, ప్రజా సంబంధాల మంత్రి కె.పార్థసారథి ఈ సవరణను ప్రకటించారు, ఈ మార్పులు విస్తృత వ్యాపారంలో సులభమైన విధానమన్నారు. చట్టంలోని సెక్షన్ 54 ప్రకారం, పని గంటలను రోజుకు తొమ్మిది నుంచి పది గంటలకు పెంచినట్లు ఆయన వివరించారు. అదనంగా, సెక్షన్ 55 కింద సూచించిన విరామ వ్యవధిని మార్చారు. గతంలో ఐదు గంటలు పని మధ్య విశ్రాంతి తీసుకునేందుకు ఒక గంట సమయం ఉండేది. ఇప్పుడు దానిని ఆరు గంటలకు మార్చినట్లు తెలిపారు. ఈ చట్టం ప్రస్తుతం రోజుకు గరిష్ఠంగా తొమ్మిది పని గంటలను అనుమతిస్తుంది, ఐదు గంటల నిరంతర పని తర్వాత తప్పనిసరిగా 30 నిమిషాల విరామం తీసుకోవాలి. ఓవర్ టైం పరిమితిని కూడా ప్రస్తుతమున్న 75 గంటల నుంచి 144 గంటలకు పెంచారు.

నియోజకవర్గంలో పరిస్థితి

తుని నియోజకవర్గంలో పదుల సంఖ్యలో జీడి పిక్కల ఫ్యాక్టరీలు, రొయ్యపిల్లల ఉత్పత్తి చేసే హేచరీలు, రొయ్యల చెరువులు, ఫార్మా కంపెనీలు, చిన్న చిన్న పరిశ్రమలు, మిల్లులు, నిర్మాణ రంగం, ఇతరేతర దుకాణాలు ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది స్త్రీ, పురుషులు కార్మికులుగా జీవనోపాధి పొందుతున్నారు. రోజు ఎనిమిది గంటలు పని చేస్తున్న నిర్మాణ, ఫ్యాక్టరీ కార్మికులు పని గంటల పెంపుతో అదనంగా పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్త్రీలు ఇళ్లవద్ద పిల్లలను పాఠశాలలకు పంపించి, వంటావార్పు పూర్తి చేసుకుని దుకాణాల్లో పనులకు వెళుతున్నారు. ఇకపై పిల్లల ఆలనాపాలన చూసే సమయాన్ని సైతం కేటాయించలేమని వాపోతున్నారు.

దీంతో కార్మికులకు పనిభారం పెరుగుతుండగా, మహిళలు కుటుంబ సంబంధాలకు దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలోనే కాకుండ ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా ఏపీలో కొత్త పోకడకు శ్రీకారం చుట్టడం దుర్మార్గపు చర్యగా కార్మికులు అభివర్ణిస్తున్నారు.

ఆందోళన, అభద్రతాభావం

రాష్ట్రంలో 50 లక్షలకుపైగా ఉన్న కార్మికులపై తీవ్ర ప్రభావం పడుతుందని, మూడు షిఫ్టులలో పని చేసే సమయాన్ని రెండు షిఫ్టుల్లోనే పూర్తి చేయాల్సి ఉంటుందని, దీంతో ఒక షిఫ్టు కార్మికులు ఉపాధి కోల్పోతారన్న ఆందోళన, అభద్రతాభావం కార్మికుల్లో నెలకొంది. తీర్మాన ప్రభావం వెంటనే కనిపించకపోయి నప్పటికి దీర్ఘకాలంలో ఉపాధి అవకాశాలకు గండిపడుతుంది. మహిళలు రాత్రివేళల్లో పనులకు వెళ్తే కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుంటాయని, ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

అసెంబ్లీ ముట్టడికి సిద్ధం

రక్తాన్నిసైతం చిందించి ఎన్నో పోరాటాల ఫలితంగా ఎనిమిది గంటల పని దినాలను సాధించుకున్నామని, అందుకు గుర్తుగా ప్రతీ సంవత్సరం మేడే జరుపుకుంటున్నామని కార్మిక వర్గాలు పేర్కొన్నాయి. అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయా లని డిమాండ్ చేస్తూ కలసివచ్చిన రాజకీయ పక్షాలతో సీఐటీయూ, ఇతర అనుబంధ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా యి. తీర్మానాన్ని రద్దు చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైన అసెంబ్లీ ముట్టడికి వెనుకాడబోమని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

ముగ్గురిలో ఒకరు ఉపాధి కోల్పోతారు



పని గంటలు పెంపుతో ప్రతి ముగ్గురిలో ఒకరు ఉపాధి కోల్పోతారు. కార్మికులకు పని భారం పెరుగుతుంది. కుటుంబానికి ఆసరాగా ఉంటున్న మహిళలు రాత్రి వేళల్లో పనులకు వెళ్లాల్సివస్తే ఆయా కుటుంబాలు చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉంది. పనిగంటల పెంపు, మహిళలు రాత్రి వేళల్లో పనులంటే ప్రమాదపు ఘంటికలు మోగుతున్నట్టే.

–నక్కెళ్ల శ్రీనివాస్, సీఐటీయూ తుని మండల కన్వీనర్

కార్మిక హక్కులు పరిరక్షించాలి



బానిసత్వం విజృంభిస్తుందనడానికి పని గంటల పెంపే నిదర్శనం. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే పని గంటలు పెంపు. కార్మికులతో ఊడిగం చేయించే ఎత్తుగడతో బానిసలుగా మార్చే ప్రయత్నాలను కార్మికులు, మహిళలు ఏకమై అడ్డుకోవాలి. పాలకులు కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేస్తూ కార్మికుల హక్కులను పరిరక్షించాలి.

–దుంగల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ తుని మండల అధ్యక్షుడు

క్లుప్తంగా

పాదాలమ్మ సన్నిధిలో ముద్రగడ గిరిబాబు


పాదాలమ్మ తల్లిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు గ్రామ దేవత పాదాలమ్మ అమ్మవారిని శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు పాదాలమ్మ తల్లి ఆశీస్సులు నిండుగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కుటుంబానికి భద్రం


వైద్య శిబిరంలో సూచనలు చేస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు రూరల్: మహిళ ఆరోగ్యంతోనే ఆ కుటుంబం భద్రంగా ఉంటుందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. మండలంలోని గజ్జనపూడిలో ప్రత్తిపాడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, మహిళలకు పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీ మోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఒమ్మంగి సెక్టార్ సూపర్ వైజర్ జి.మంగారత్నం, దాకారపు కృష్ణ, అగన్‌వాడీ టీచర్లు ఎ.అప్పలనర్స, పార్వతి, లోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్యంతో అధిక దిగుబడులు


అరెంపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ గాంధీ

శంఖవరం: సమర్థ నీటి యాజమాన్యంతో వరిలో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. మండంలోని ఆరెంపూడి గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా వరి పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. వరి నాట్లు వేసిన 20 రోజుల తరువాత పొలంలో పలుచని నీటి మట్టాన్ని నిర్వహించి అనంతరం తడి పొడి విధానాన్ని పాటించడం ద్వారా 15 నుంచి 20 శాతం నీటిని ఆదా చేయవచ్చన్నారు. సూక్ష్మ పోషకాలైన జింక్, బోరాన్, ఇనుము లోపాల లక్షణాలను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు సమగ్ర సస్య రక్షణలో భాగంగా వివిధ కిట్లు, లింగకర్షక బుట్టలు, జిగురు పూసిన అట్టలను రాయితీపై అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనువాస్ పాల్గొన్నారు.

పురుగు మందుల పిచికారీపై అవగాహన


పురుగు మందుల పిచికారీ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

కిర్లంపూడి: వరి పంటకు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు విధిగా జాగ్రత్తలు పాటించాలని ఏఓ సుధామాధురి సూచించారు. గురువారం ముక్కొల్లులోని రైతులకు పొలంబడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం వరి పంటలను పరిశీలించి పలు చోట్ల చుట్టుపురుగు ఆశిస్తున్నట్టు గుర్తించారు. చుట్టపురుగు నివారణకు సూచనలు అందజేశారు. పురుగుమందులు వల్ల కలిగే విష ప్రభావం, దాని నివారణ చర్యలపై రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు.

ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్స్ డే

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఫార్మసీ స్కూల్, కళాశాలల్లో ఫార్మసిస్ట్స్ డే గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా పాల్గొని ఉద్యోగ అవకాశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ కె.రవిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాత్యాయనీ దేవిగా అమ్మవారు


ఏలేశ్వరం దుర్గాదేవి ఆలయంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అమ్మవారు కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు కుంకుమ పూజలు చేస్తున్నారు. విశ్వ హిందూపరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గాదేవి ఆలయంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో లలిత, విష్ణు సహస్ర నామాలు పఠించారు. కార్యక్రమంలో పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటి, దేవి, కుమారి, సుజాత, అనురాధ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవి అలంకరణలో నేరేళ్లమ్మవారు


మహాలక్ష్మీ దేవి అలంకరణలో గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారు


వీరభద్రునిగడ్డెలో కనకదుర్గమ్మకు నివేదించిన 108 రకాల పిండివంటలు

తొండంగి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారు గురువారం మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. ప్రధానాలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన దాతలు యడ్ల నాగేశ్వరరావు, ధనలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో అమ్మవారిని మీనాక్షి దేవిగా అలంకరించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

108 రకాల పిండివంటలతో నివేదన

గోకవరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాల్గవ రోజు గురువారం గోకవరం దేవీచౌక్ ఆలయంలో కొలువైయున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి శ్రీభువనేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకులు అమ్మవారికి అలంకార పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108 రకాల పిండి వంటలను సిద్ధం చేసి నైవేద్యంగా నివేదించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.


రౌతులపూడి సినిమా సెంటర్‌లో కాత్యాయనీ దేవిగా దర్శనమిస్తున్న కనక దుర్గమ్మవారు

కాత్యాయనిదేవిగా కనక దుర్గమ్మవారు

రౌతులపూడి: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక సినిమా సెంటర్‌లో వేంచేసియున్న కనక దుర్గమ్మ అమ్మవారు గురువారం కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునుంచే అమ్మవారి ఆలయానికి వచ్చి కాత్యాయనీ దేవిగా అవతరించిన అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకమార్చన కార్యక్రమంలో పురోహితులు బానుభాబు వేదమంత్రోచ్ఛరణ చేశారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు.

పీహెచ్‌సీలో తుప్పల తొలగింపు

గండేపల్లి: గండేపల్లి పీహెచ్‌సీ ఆవరణలో గురువారం స్వచ్ఛతహి సేవా–2025లో భాగంగా తుప్పలు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఎంపీడీఓ కె.హరికృష్ణ సత్యారెడ్డి తెలిపారు. ఏక్ దిన్ ఏక్ ఘంట ఏక్ సాథ్ అనే నినాదంతో పరిసరాలను వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఐఎస్ శ్రీనివాస్, ఏఓ కె.చంద్రరావు, కార్యదర్శి వీఆర్ ఫణీంద్ర కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది, మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు, బి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు పరీక్షలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి, ఒమ్మంగి గ్రామాల్లో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతహి సేవా–2025 కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఒమ్మంగి పంచాయతీ పారిశుధ్యం కార్మికులకు విధి నిర్వహణలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వై.గీతా సుధ, ఎల్‌టీ అజయ్, ఎంపీహెచ్‌ఏ శ్రీను, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై శిక్షణ కార్యక్రమం

తుని రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్ర, శనివారాలు పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంపుపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాలు ఉదయం పది గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. సర్పంచులు, కార్యదర్శులు సకాలంలో హాజరై శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

చిరు వ్యాపారులకు సదావకాశం

కిర్లంపూడి: చిరువ్యాపారులకు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఏపీఎం ఎస్.వేదకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏపీడీఐసీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటల నుంచి స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం నందు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆసక్తిగల చిరువ్యాపారస్తులు హాజరుకావాలని ఆమె కోరారు.

ఫార్మా రంగంలో వృద్ధి చెందాలి

గోకవరం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదర్శ ఫార్మసీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ ఫార్మసిస్ట్ డే సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర త్రినాథ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జేఎస్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ సమయమంతుల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. విద్యార్థులు ఫార్మా రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ పి.కనకరాజు, సెక్రటరీ పి.నాగమణి, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఆయనను సత్కరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

వైభవంగా బోనాల జాతర


ధర్మవరంలో బోనాలు ఎత్తిన భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, ఏలూరు, వేములపాలెం, రౌతుపాలెం గ్రామాల్లో బోనాల జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి బోనాలను నెత్తిన పెట్టుకుని గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. దారి పొడవునా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బోనాలను అమ్మవారికి సమర్పించారు. భవాని నామస్మరణతో జాతర మార్మోగడంతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఏలూరులో దాడిశెట్టి అనంతబాబ్జి సమకూర్చిన చీరలు, పసుపు, కుంకుమలను ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ మహిళలకు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీటీసీ దాడిశెట్టి రాణి, దాడిశెట్టి నూకాపతి, రొంగల సత్యనారాయణ, కొట్టేటి రాయుడు, జామి మాణిక్యం, అడ్డాల త్రిమూర్తులు, కొట్టేటి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న రైటర్ రమణ

రౌతులపూడి: ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న దొంగతనాలు, మోసాలు దృష్ట్యా ప్రతి ఒక్క దుకాణదారుడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉందని రౌతులపూడి పోలీస్ స్టేషన్ రైటర్ డీవీ రమణ అన్నారు. గురువారం మండల కేంద్రం రౌతులపూడి ప్రధాన రహదారిలోని బంగారు నగల వ్యాపారస్తులు, పెట్రోల్ బంకు యజమానులు, వివిధ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో రౌతులపూడి పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు నూకరాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిష కళానిధి బిరుదు ప్రదానం

జగ్గంపేట: జగ్గంపేటకు చెందిన పురోహిత పండితుడు, వాస్తు జ్యోతిష శాస్త్రాలలో ప్రావీణ్యత కలిగిన మామిళ్లపల్లి అయ్యప్పకు జ్యోతిష కళానిధి బిరుదు లభించింది. రాజమహేంద్రవరంలో గురువారం విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త జ్యోతిష సమ్మేళనం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది వాస్తు జ్యోతిష పండితులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జగ్గంపేటకు చెందిన మామిళ్లపల్లి అయ్యప్ప జ్యోతిష, వాస్తు శాస్త్రాల పట్ల చేసిన పరిశోధనలకు గుర్తింపుగా బిరుదును అందుకున్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం నేతలు అభినందించారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం..


యర్రవరంలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీఓ రవికుమార్ వర్మ


రౌతులపూడి సీహెచ్‌సీలో పరిసరాలను శుభ్రం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఏలేశ్వరం: మొక్కల పెంపకంతో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఎంపీడీఓ రవికుమార్ వర్మ అన్నారు. మండలంలోని యర్రవరం గ్రామంలో గురువారం ఏక్‌దిన్, ఏక్ గంట, ఏక్ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మొక్కలు నాటడం, పారిశుధ్య కార్మికులకు సన్మానం, వైద్యశిబిరం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సన్మానం చేయడం మన బాధ్యతన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి రామరాజువర్మ, అంగన్‌వాడీ, వైద్య, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రత అందరి బాధ్యత

కోటనందూరు: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ పీ.వెంకటనారాయణ అన్నారు. ఏక్ దిన్..ఏక్ గంటే..ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ నారాయణ, తహసీల్దార్ సత్యన్నారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.జయరామం తదితర అధికారులు గురువారం రోడ్లను శుభ్రం చేశారు. బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ చేసి పరిశుభ్రతపై నినాదాలు చేశారు. రోడ్లపై చెత్త వేయకూడదని, మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని దుకాణదారులకు సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి: ప్రతి ఒక్కరు తమ చుట్టూవున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడాలని రౌతులపూడి సీహెచ్‌సీ వైద్యాధికారి డా.ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక సీహెచ్‌సీలో స్వచ్ఛోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో సీహెచ్‌సీ సిబ్బందితో కలసి ఆయన స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో వున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, శుభ్రం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు చైతన్యం కల్పించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

తుని రూరల్: మండల పరిధిలో పలు గ్రామాల్లో అధికారులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం తేటగుంట, వి.కొత్తూరు, డి.పోలవరం, తదితర గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో కలసి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తేటగుంటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, డీఎల్‌డీఓ శ్యామల, ఎంపీడీఓ కె.సాయినవీన్, పీఏసీఎస్ అధ్యక్షుడు పేరూరి కృష్ణ, చింతంనీడి నాగసోమరాజు, గజ్జి అప్పలరాజు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

కిర్లంపూడి: పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను పురస్కరించుకుని బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో గురువారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తొలిత దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సేవా కార్యక్రమంలో కంట కాశీ విశ్వనాథం, ఐవీవీ సత్యన్నారాయణ, సింగిల్‌దేవ్ సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

తాటాకిళ్లు దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన తాటాకిళ్లు

ఏలేశ్వరం: మండలంలోని పేరవరం గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన వేమగిరి చక్రమ్మ తాటాకిళ్లు దగ్ధం కావడంతో నిరాశ్రయులయ్యారు. బాధితురాలు చక్రమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదానికి విద్యుత్ సర్క్యూట్ కారణమని స్థానికులు భావిస్తున్నారు.

బాధితులకు సహాయం..

ఏలేశ్వరానికి చెందిన హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధితులకు సహాయం చేశారు. వంట సామగ్రి, బియ్యం బస్తా, రూ.2వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ఎస్‌కె ఆలీషా, బండికోటి, రామ్‌లాల్, మద్దుల స్వరూప్, పర్వత శివ, లక్ష్మణ్ పాల్గొన్నారు.